
హైదరాబాద్ వార్త



# పెరుగుతున్న కొవిడ్ కేసులు

**అప్రమత్తంగా ఉంటేసరి · భయం లేదంటున్న వైద్యులు · గాంధీ ఆస్పత్రిలో సర్వం సిద్ధం**



గాంధీ ఆస్పత్రి భవనం

**సికింద్రాబాద్, మే 24 ప్రభాతవార్త:** హాంకాంగ్, సింగపూర్ దేశాలతో పాటు మన దేశంలోని మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుతో పాటు హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో విస్తరించింది. వేగంగా వ్యాప్తి చెందుతున్న కరోనా విస్తరించకుండా కట్టడి చేయడానికి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. తాజాగా విస్తరిస్తున్న కరోనా గురించి ఆందోళ చెందాల్సిన అవసరం లేదంటున్నప్పటికి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. థర్డ్‌వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ సబ్ వేరియంట్ జేఎన్-1 ప్రస్తుతం వేగంగానే వ్యాప్తి చెందుతోంది. ఒకవైపు ఒమిక్రాన్ సబ్ వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతున్నప్పటికి ఆందోళ చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఐపీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రిసెర్చ్) గణాంకాల ప్రకారం రెస్పరేటరీ వైరస్‌లలో కోడిడ్ పాజిటివ్ కేసులు 65శాతం ఉన్నాయని తెలుస్తోంది. పాండమిక్ ఎపిడమిక్, ఎండమిక్ మూడు స్టేజ్‌లు ఉంటాయని, కోవిడ్ వైరస్ వీటిలో చివరిదైన వైరస్‌లలో ఒకటని తేలింది. కామట్టి కోవిడ్ వైరస్‌ను ప్రాణాంతకకమైనదిగా చూడాల్సిన అవసరం లేదని వైద్యులు చెబెతున్నారు. సాధారణంగా వచ్చే దగ్గు, జలుబు వంటివిగానే పరిగణించాలని పేర్కొంటున్నారు. ఒమిక్రాన్ సబ్ వేరియంట్ బీఏ.2.86 నుంచి రూపాంతరం చెందిన జేఎన్-1లో మూడు సబ్ వేరియంట్‌లు ఎన్‌బీ.1.8.1, పీసీ.2.1 ఎక్స్‌ఈసీ.25.1లు తాజాగా వ్యాప్తి చెందుతున్నట్లు ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రిసెర్చ్ గుర్తించింది.

**ప్రజల్లో పెరిగిన హెర్డ్ ఇమ్యూనిటీ....**

కోవిడ్ విస్తారంగా వ్యాప్తి చెందిన 2019-2020లో అనేక మంది ప్రాణాలను కోల్పోయారు. ప్రతీ ఇంటిలో ఒకరిద్దరికి కోవిడ్ రావడం అనేది సాధారంగా మారింది. ఎంతో భయాందోళనకు గురైన ప్రజలు ఆస్పత్రులు, ఇళ్ళల్లోనే క్వారంటైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కోవిడ్ వ్యాక్సిన్ అందించడంలో విజయం సాధించింది. దేశంలో దాదాపు 80శాతం మంది కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నారు. అప్పట్లో తీసుకున్న వ్యాక్తిన్ ప్రభావం ఇప్పుడు ఉండదు కదాని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. మళ్లి వాక్సిన్ తీసుకోవడం అవసరం లేదని, అప్పట్లో కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో వ్యాక్సిన్ ప్రభావం తగ్గిపోయినప్పటికి జనాల్లో హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చిందని చెబుతున్నారు.

**ఈ వేరియంట్ వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

డాక్టర్ రాజ్‌కుమారి, సూపపింటేండెంట్ గాంధీ ఆస్పత్రి



తాజాగా విస్తరిస్తున్న జేఎన్-1 వల్ల ఎలాంటి ప్రమాదం లేదు. ముఖ్యంగా ఈ వేరియంట్ చిన్నపిల్లల్లో కనిపించడం లేదు. ఈ వేరియంట్ వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరు మాస్క్‌లు ధరించాలి. కాకపోతే అప్రమత్తంగా ఉండాలి. గాంధీ ఆస్పత్రిలో 60 బెడ్‌లతో కూడిన మూడు వార్డులను సిద్ధం చేశాము. కోవిడ్ లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలి. కోవిడ్ పేషెంట్‌ల పర్యవేక్షణకు అస్పత్రిలో ఓ కమిటిని కూడా నియమించాము. వారు కూడా అప్రమత్తంగా ఉంటారు.

# టాక్స్ వసూళ్లలో లక్ష్య సాధనపై దృష్టి సారించాలి

**-రెసిడెన్షియల్‌తోపాటు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా వసూలు చేయాలి**

**-అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వికర్ణన్, సిసిపి శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్, మే 25,ప్రభాతవార్త:** లక్ష్యం మేరకు టాక్స్ వసూలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వార్ హాల్ లో టౌన్ ప్లానింగ్ అడిషనల్ సిసిపి, డిప్యూటీ కమిషనర్లు, ఏ.సి.పి లతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ కంటెంప్ట్ కోర్టు కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బిల్లు కలెక్టర్లు రెసిడెన్షియల్ టాక్స్‌తో పాటుగా ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా వసులు చేయాలని డిప్యూటీ కమిషనర్ లను ఆదేశించారు. రెసిడెన్షియల్ నుండి కమర్షియల్‌గా మార్చి పన్ను వసూళ్ల చేయాలని సర్కిల్ స్థాయిలో రోజు తప్పించి రోజు సమీక్ష చేసుకుని టాక్స్ వసూళ్ల లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. డిసిలతో టాక్స్‌పై అడిషనల్ కమీషనర్ కూడా రివ్యూ చేయాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజుల్లో హడావిడి చేయకుండా నిర్దేశించిన లక్ష్యం మేరకు వసూలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అంతకు ముందు వివిధ జోన్ లలో ఉన్న కంటెంప్ట్ కేసులకు సరైన రిప్లై ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క జోన్ వారిగా కంటెంప్ట్ కేసులపై సమీక్షించారు. కోర్టు తీర్పు ప్రకారంగా సరైన రిప్లై ఇవ్వాలని ఈ విషయంలో అవసరమైన సహాయం కొరకు లీగల్ ఓ.ఎస్.డి అడిషనల్ కమిషనర్ సత్యనారాయణ, సిసిపి శ్రీనివాస్ లను సంప్రదించాలని సూచించారు. కంటెంప్ట్ కేసులు తర్వాత వచ్చే వారంలో రిట్ పిటిషన్లపై రివ్యూ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో సిసిపి శ్రీనివాస్, అడిషనల్ కమీషనర్లు అనురాగ్ జయంతి, సత్యనారాయణ, వేణు గోపాల్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రామ్ నాయక్, అడిషనల్ సిసిపి వెంకన్న, లీగల్ ఓ.ఎస్.డి సుధీర్, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ ఏ.సి.పి లు తదితరులు పాల్గొన్నారు.

# 'కిక్' ఎక్కితే..మా రూటే సపరేట్ !

**- ట్రాఫిక్ పోలీస్ డ్రంకెన్ డ్రైవ్‌పై లేని భయం**

**- నిత్యం ఒకే ప్రదేశంతో బాధితులు పరార్**

**- మొక్కుబడి చర్యలతో లేని ప్రయోజనం**

**- ప్రమాదాల్లో అవే కేసులేలా?**

**- అంతంత మాత్రమే రూ.10వేల ఫైన్, ఆరు నెలల శిక్ష**



ఆల్కహాల్‌పై బ్రీత్‌ఎనలైజర్ టెస్ట్ చేస్తున్న ట్రాఫిక్ పోలీస్ (ఫైల్ ఫోటో)

**హైదరాబాద్, మే24, ప్రభాతవార్త:** తప్పతాగి ప్రమాదాల బారినపడుతూ కుటుంబాలను దిక్కులేని వారిని చేస్తున్నారనే భావనతో ప్రభుత్వం డ్రంకైన్ డ్రైవ్‌తో అడ్డుకట్టవేస్తుంది. బైక్, కార్లు నడిపేవారు తాగకుండా గమ్యాన్ని చేరుకోవాలనే సూచనలతో వారంతం, సెలవుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. తొలిసారి పట్టబడితే ఒక మాదిరిలా, పునారవృత్తమైతే భారీగా శిక్షలు విధించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించిన మందుబాబులు వ్యవహారశైలిని మాత్రం మార్చుకోవడం లేదు. ఏళ్లగా కొనసాగుతున్న చర్యల్లో ఏమైన మార్పులు ఉన్నాయా అంటే లేదనే తెలుస్తుంది. అంతకు మించి కేసుల తీవ్రత, ప్రమాదాల్లో అవే కిక్‌లు కనిపిస్తున్నాయి. చేతివాటం, శిక్షలు విధించకపోవడంతో నిందితులుగా కోర్టుమెట్లు ఎక్కుతున్నారు. గత మూడు నెలల్లో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిల్లో సుమారు 3,200 కేసులు నమోదయ్యాయి. క్రమక్రమంగా పెరుగుతున్నాయే తప్పా..తగ్గుముఖం పట్టడం లేదు. ఇక అడ్డదారిలో వెళ్లే మరెంతోమంది మందుబాబులు ఎక్కడోఒకచోట ప్రమాదాలకు గురవుతున్నారు.

**పట్టుబడేవారంతా యువతనే...**

డ్రంకైన్ డ్రైవ్‌లో పట్టుబడివారంత యువతనే ఉంటున్నారు. 20 నుంచి 40 ఏళ్లు ఉన్నవారే స్నేహితుల పార్టీలని, వారంతపు ఎంజాయ్, సెలవుల్లో ఉద్యోగుల బాతకానీలంటూ ఇతర ప్రాంతాల బార్‌లలో మోతాదుకు మించి తాగి వాహనాలను నడుపుతున్నారు. అధికశాతం 20 నుంచి 30ఏళ్ల వారిపైన కేసులు నమోదవుతున్నాయి. ఉదయం నుంచి అర్ధరాత్రి దాటక కూడా మద్యం పొంగుతూనే ఉంటున్నాయి. రోడ్డెక్కి కేరింతలతో బైక్‌లను వేగంపెంచుతూ విన్యాసాలు చేస్తున్నారు. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్. షేక్‌పేట, సికింద్రాబాద్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలిలో మరీ దారుణమైన పరిస్థితి కనిపిస్తుంది. ఏ బైక్ చూసిన కిక్‌తోనే ఉండడంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని తోటి వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. సంపన్న కుటుంబాల పిల్లలే భారీగా సౌండ్ వచ్చే హారన్‌లతో మోత మోగిస్తూ రయ్యిరయ్యిన దూసుకవెళ్తున్నారు. పీకలదాక మత్తులో ఉండడంతో ప్రమాదాల ధ్యాస లేకపోవడంతో రోడ్లపైన జరిగే పరిణామాలు తెలుసుకోకపోవడంతో యాక్సిడెంట్లు అవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులకు దొరక్కుంగా ప్రధాన రహదారుల్లో కాకుండా అడ్డదారిలో ప్రయాణిస్తూ తప్పించుకుంటున్నారు. అధికశాతం బైక్‌లు ఒక్కొక్కరు ఉండగా కార్లలో అమ్మాయిలు, అబ్బాయిలతో కూడి స్నేహితులు నలుగురైదుగురు ఉంటున్నారు. సంపన్న కుటుంబాలకు చెందిన యువత కావడంతో ఏమాత్రం భయం లేకుండా ధీమాతో రాకపోకలు సాగిస్తూ డివైడర్లకు ఢీకొట్టడం, ఇతర వాహనాలకు తాకిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు.

**ఒకే ప్రాంతంలో ఒకే చోట తనీఖీలతో 'అడ్డదారి'**

హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రధానమార్గాలు, ముఖ్యమైన దారుల్లో డ్రంకైన్ డ్రైవ్ తనీఖీలు చేపడుతున్నారు. నెలలుగా ఒకే చోట ఉండడంతో మందుబాబులు మరో ప్రత్యామ్నాయంగా అడ్డదారిలో వెళ్తున్నారు. దీంతో ఎక్కడో ఒక చోట తూలుతూ గొడువలు చేయడం, కేకలుపెట్టడం, ప్రమాదాలకు గురవడం సైతం వంటి ఘటనలు జరుగుతున్నాయి. సీరియస్‌నెస్ లేకుండా ఇంట్రెస్ట్ లేని విధంగా ప్రభుత్వ లెక్కల కోసం చర్యలు చేపడుతున్నారనే విమర్శలు సైతం పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. బార్ నుంచి వచ్చిన ప్రాంతం కూడా దాటకుండా పోలీసులు కట్టడి చర్యలు చేపడితే ప్రమాదాలు జరిగే ఆస్కారం లేకపోగా తగ్గుముఖం పట్టేఛాన్స్ ఉంటుంది. అది కాకపోయిన బైక్‌నడిపేందుకు స్నేహితుడు వెంట పెట్టుకొచ్చే వీలు లేకపోలేదు. అదేవిధంగా ప్రాంతాలను మారుస్తూ ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తే మరెందరో పట్టుబడుతారని ప్రజలు చెబుతున్నారు. మొక్కుబడి అని కాకుండా పకడ్బందిగా చర్యలు చేపడితే డ్రంకైన్ డ్రైవ్ కేసులు కొలిక్కి వచ్చే పరిణామం ఏర్పడవచ్చు. తొలిసారి పట్టుబడితే రూ.10వేల జరిమాన, ఆరు నెలల జైలు శిక్ష, రెండోసారి కేసు నమోదైతే రూ.15వేలు. మూడేళ్ల శిక్ష ఉన్నా అక్కడోఇక్కడో అరకొర విధిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గత మూడు నెలల వ్యవధిలో సుమారు రెండొందల ప్రమాదాల్లో అధికశాతం మద్యంమత్తువే ఉండడం గమనర్హం. మందుబాబులకు తెలియకుండా నిరంతరం కొత్తగా చర్యలు చేపడితే కేసుల శాతం తగ్గుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# లేఔట్‌లలో పార్కులు...రహదారులు మారవు!

**-ఓనర్ల అనుమతితోనే లేఔట్‌ల రివైజింగ్**

**-రెవెన్యూ రికార్డుల్లోనూ మార్పులు అవసరం**

**-వివిధశాఖల సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్**




సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, మే 24,ప్రభాతవార్త:** లే ఔట్ ఏదైనా అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈమేరకు శనివారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో లేఔట్‌లపై నిర్వహించిన వర్క్‌షాప్‌కు జీహెచ్‌ఎంసీ, హెచ్ ఎండీఏ, డీటీసీపీ, ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలకు చెందిన పలువురు నిపుణులు హాజరయ్యారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 10 శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయితే ఆలేఔట్లను గుర్తించాల్సినవసరం ఉందన్నారు.అందులో మార్పులు చేయాల్సి ఉంటే.. అప్పటికే ప్లాట్ల కొన్న వారి అనుమతితో రివైజ్ చేయాల్సి ఉందని అబిప్రాయపడ్డారు. అలాగే 10 శాతం పార్కులు, ప్రజావసరాలకు కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ, డీటీసీపీ, హెచ్ ఎండీఏ ఇలా ఏ స్థాయిలో లే ఔట్ అనుమతులు పొందినా.. అందులోని పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలపై ప్రభుత్వానికి హక్కులుంటాయనన్నారు.అన్ ఆథరైజ్డ్, అన్ అప్రూవల్ , అప్రూవల్ లే ఔట్లు ఏంటి..? వాటికి సంబంధించిన జీవోలను పరిశీ లించారు. ఎకరం స్థలంతో మొదలై..ఎంత విస్తీర్ణంలో అయినా లే ఔట్లు వేసుకోవచ్చునని పేర్కొన్నారు.

**రెవెన్యూ రికార్డుల్లో మార్చాల్సిన అవసరం ఉంది..**

దశాబ్దాల క్రితం గ్రామపంచాయతీలు అనుమతి ఇచ్చిన లే ఔట్ల విషయం రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాల్సినవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది. సదరు భూమి లేఔట్‌గా మారిందనే విషయం రెవెన్యూ రికార్డులలో నమోదు కాకపోవడంతోనే.. తర్వాత తరం వారు పాసు పుస్తకాలు తెచ్చుకుని ఆయా స్థలాలమీదకు వెళ్లి.. వ్యవసాయ భూమి పేరిట ఆక్రమణలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి పొందిన పాత లేఔట్ల విషయంలో కొన్ని ప్లాట్లు రెగ్యులరైజ్ అయితే ఆ లే ఔట్‌ను గుర్తించినట్టేనన్నారు. తర్వాత ఆభూమిని వ్యవసాయ భూమిగా మార్చడం జరగదని.. ఒక వేళ రద్దు చేస్తే అందులో ప్లాట్లు కొన్న వారి అనుమతితో మాత్రమే చేయాల్సి ఉంటుందని ప్రిలిమనరీ అప్రూవల్‌తో అమ్మకాలు జరపవచ్చునని పేర్కొన్నారు. అయితే లే ఔట్ స్వరూపం మారరాదని తెలిపారు.

**అక్రమ నిర్మాణాలను తొలగించవచ్చు..**

తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన వాటిపైన చర్యలు తీసుకోవచ్చునని సదస్సు అభిప్రాయ పడింది. ఇందుకు సంబంధించి సుప్రింకోర్టు, హైకోర్టు ఇచ్చిన తీర్పులపై సదస్సు కూలంకుషంగా చర్చించింది. చెరువు పరిధిలో నిర్మించిన కట్టడాల విషయంలో కూడా నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేకుండా తొలగించ వచ్చునని పేర్కొంది. రహదారులు, పార్కులలో నిర్మాణాలు చేపట్టినా ఇది వర్తిస్తుందని సూచించింది. అలాగే రెగ్యులరైజ్‌చేసిన ఇంటి స్థలాలు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తే వాటిని రద్దు చేసే అధికారం కూడా ఉందని పేర్కొంది. పాత, కొత్త లేఔట్‌లున్న సమయంలో.. పాత లే ఔట్లో రిజిస్ట్రేషన్లు జరిగితే వాటిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని అలాగే ఫైనల్ లే ఔట్ వస్తే అందులో ఎలాంటి మార్పులు చేయరాదని సుప్రింకోర్టు గతంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ సందర్భంగా ఇటీవల చేపట్టిన ఆక్రమణల తొలగింపులో ఎదురైన అంశాలను కమిషనర్ రంగనాథ్ వివరించారు. హైడ్రా చర్యలతో ఇంటి స్థల పరిరక్షణపై భరోస వస్తోందని పలువురు పేర్కొన్నారు.

# ప్రైవేట్ హాస్టళ్లపై "టాస్క్‌ఫోర్స్" కొరడా

**-దిల్‌షుఖ్‌నగర్, కూకకట్‌పల్లి,శేరిలింగంపల్లి ప్రాంతాల్లో తనిఖీలు**

**-నింధనలు పాటించని 38హాస్టళ్లకు నోటీసులు..7హాస్టళ్ల కిచెన్ సీజ్**

**-రూ.2.46లక్షల జరిమానా విధించిన జిహెచ్‌ఎంసి అధికారులు**





హాస్టళ్లలో తనిఖీ చేస్తున్న జిహెచ్‌ఎంసి టాస్క్‌ఫోర్స్ బృదం

**హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్దంగా నిర్వహిస్తున్న పలు హాస్టళ్లలో జిహెచ్‌ఎంసి టాస్క్ ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశాల మేరకు వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలు పలు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ షోకాజు నోటీసులు, కిచెన్ సీజ్ తో పాటు జరిమానాలు విధించారు. శుక్రవారం నాడు 58 హాస్టళ్లను తనిఖీ చేసి 30 హాస్టళ్లకు నోటీసులు జారీ చేసి, 8 హాస్టల్ కిచెన్ లను సీజ చేసి సుమారు 2.45 లక్షల రూపాయల జరిమానా విధించారు.అలాగే శనివారం ఎల్బీనగర్ జోన్‌లోని శ్రీనగర్ కాలనీ, లలిత నగర్, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి జోన్‌లోని కెపిహెచ్‌బి మూసాపేట్ ప్రాంతాలు, శేరిలింగంపల్లి జోన్‌లోని వినాయక్ నగర్, పత్రికా నగర్‌లలో ఈ డ్రైవ్ నిర్వహించారు. 60 హాస్టళ్లను తనిఖీ చేసి 38 హాస్టల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి 07 హాస్టల్ కిచెన్ లను మూసివేశారు. జీహెచ్‌ఎంసి చట్టం, 1955 నిబంధనల ప్రకారం బృందాలు రూ.2,.46లక్షల జరిమానా విధించారు. హాస్టల్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం కాకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించడం మూలంగా ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో జీహెచ్‌ఎంసి కమీషనర్ టాస్క్ ఫోర్స్ బృందాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సెల్‌ఫోన్ దొంగను పట్టించిన రోడ్డు ప్రమాదం



రోడ్డు ప్రమాదంతో పోలీసులకు దొరికిపోయిన సెల్ ఫోన్ దొంగ దృశ్యం

**నార్సింగి, మే 24 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదం సెల్ ఫోన్ దొంగను పోలీసులకు పట్టించింది. కాలం కలిసి రాక దొంగిలించిన మొబైల్ ఫోన్లతో పారిపోతుంటే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. కిందపడ్డ ఈ యువకుడిని పైకి లేపేందుకు స్థానికులు అతడి వద్దకు చేరుకున్నారు. అతడిని రోడ్డు పైనుంచి పక్కకు తీసుకెళ్లాలని స్థానికులు పైకి ఎత్తడంతో అతడి జేబుల్లోంచి ఐదారు మొబైల్ ఫోన్‌లు కింద పడ్డాయి. ఫోన్లన్నీ ఫైల్‌మోడ్‌లో ఉండడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఫ్లైట్ మోడ్‌ను తొలగించారు. ఒక్కసారిగా ఆరు ఫోన్లు మోగడంతో వాటిని ఎత్తారు. ఈ ఫోన్ మాదని, ఉదయం ఎత్తుకెళ్లారని అవతలి వ్యక్తులు చెప్పారు. ఆసుపత్రికి తీసుకెళ్దామనుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సైతం గంట సమయం తరువాత రావడంతో పోలీసులకు, దొంగలకు లింక్ ఉంటుందని, అందుకే పోలీసులు ఇంత ఆలస్యంగా వచ్చారని స్థానికులు గుసగుసలాడారు. గంటన్నర తరువాత వచ్చిన పోలీసులకు సదరు వ్యక్తిని స్థానికులు అప్పగించారు. పోలీసులు అతడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. తమదైన శైలిలో విచారిస్తే ఎన్ని ఫోన్లు, ఎక్కడి నుంచి ఎత్తుకెళ్తున్నాడో మొత్తం బయటకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాగిన మత్తులో ఉండడంతో ఆ దొంగ ఎంత అడిగినా తన పేరును చెప్పలేకపోయాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నగరంలో దంచికొట్టిన వాన

**-పలుచోట్ల రోడ్లపై నిలిచిన నీరు**

**-ట్రాఫిక్‌కు అంతరాయం..వాహనదారులకు ఇబ్బందులు**



**హైదరాబాద్, మే 24,ప్రభాతవార్త:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో హైదరాబాద్‌లో సాయంత్రం నుంచి పలుచోట్ల వర్షం కురుస్తోంది. శేరిలింగంపల్లిలో మొదలైన వాన మియాపూర్, చందానగర్ లింగంపల్లి, గచ్చిబౌలి ప్రాంతాలకు విస్తరించింది. ఇటు యూసఫ్ గూడా, ఎస్సార్ పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బోరబండ, సనత్ నగర్ సికింద్రాబాద్, బోయిన్ పల్లి, బొల్లారం, ప్యారడైజ్, చిలకలగూడ, బేగంపేట, లిబర్టీ, నాంపల్లి ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. దీంతో పాతబస్తీలోని లంగర్ హౌస్, గోల్కొండ, కార్వాన్, జియాగూడల్లో పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లాయి. మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో పాటు వర్షం కురవడంతో రహదారులన్నీ చిన్నపాటి చెరువులను తలపించాయి. రహదారులపై వర్షపు నీరు నిలవడంతో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్యాంక్ బండ్ చూసేందుకు వచ్చిన పర్యాటకులు వర్షానికి తడిసి ముద్దయ్యారు. అటుగా వెళ్లే వాహనదారులు వర్షంలో తడుస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్ బాగ్, లక్డికాపూల్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, దిల్‌సుఖ్ నగర్, హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్ తదితర ప్రాంతాల్లో కూడా జోరుగా వర్షం కురిసింది. దీంతో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అప్రమత్తమె రోడ్లపై వర్షం నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

